క్లుప్తంగా

అండర్‌-19 క్రికెట్‌ జట్టుకు ఎంపిక



బి.వెంకట్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్‌: పట్టణానికి చెందిన బి.వెంకట్‌ అండర్‌–19 క్రికెట్‌ పోటీలకు ఎంపికయ్యాడని ఆదోని తాలూకా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు విట్టారమేష్‌ తెలిపారు. భీమాస్‌ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7 నుండి 25వ తేదీ వరకు వైఎస్సార్‌ కడప జిల్లాలో జరిగే ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ టెస్ట్‌ మ్యాచ్‌లో వెంకట్‌ పాల్గొంటాడని చెప్పారు. ఉమ్మడి జిల్లా కర్నూలు నుంచి బ్యాట్స్‌మెన్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కోచ్‌ బాలజీ, సంఘం కార్యదర్శులు కంబిరెడ్డి, మజీద్‌ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న ప్రహ్లాదాచారి

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన సుంకేసుల పరమేశ్వరి గంగపుత్ర ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళాన్ని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ప్రహ్లాదాచారి అందజేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆలయ నిర్వాహకులు బేస్త సేవా సంఘం సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. సర్పంచ్‌ పాల్‌దినకర్‌, ఉప సర్పంచ్‌ తిక్కయ్య, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్టుబోర్డు డైరెక్టర్‌ వెంకోబ, ఈరన్న, వైస్‌ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్‌ అవతారం ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌ఆర్‌ఓ

ఆదోని సెంట్రల్‌: ఆదోని అటవీ శాఖ అధికారిగా తేజఅశ్విని బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పత్తికొండలో పనిచేస్తున్న ఎస్‌. రామచంద్రుడు ఆదోని ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్‌ అటవీ శాఖ అధికారిని నియమించడంతో రామచంద్రుడు బుధవారం తేజఅశ్వినికి బాధ్యతలు అప్పగించారు. 2021 బ్యాచ్‌కి చెందిన తేజఅశ్విని ట్రెనింగ్‌ అనంతరం ఇక్కడ మొదటి సారిగా విధుల్లో చేరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్‌ : పట్టణంలోని ఎల్‌ఐజీ, ఎంఐజీ, కునిమొల్లా, హౌసింగ్‌ బోర్డు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ నాయకుడు శ్రీనివాసులు కోరారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్‌ బోర్డు కాలనీలోనున్న పార్కులలో మౌలిక సదుపాయాలు కల్పించి, పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న లింకు రోడ్లు, డ్రెయినేజీ కాలువలు వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గౌస్‌, నాగరాజు, గణేష్‌ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సందర్శించండి

పెద్దకడబూరు : వలంటీర్లు, గృహసారథులు మండలంలోని ప్రతి ఇంటికీ వెళ్లి అందరిని కలసి వారి సమస్యలను తెలుసుకోవాలని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సచివాలయ మండల కన్వీనర్‌ రవిచంద్రరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వలంటీర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్‌ శివరామిరెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ముక్కరన్న, తిక్కన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాలల బంద్‌

ఆదోని సెంట్రల్‌: ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదోనిలో పాఠశాలల బంద్‌ ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామాక్షి వెంకట్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అధిక ఫీజులు వసులు చేస్తున్న కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకట్‌, నరేంద్ర, సంతోష్‌, నూర్‌భాష, ముని సన్నీ, రాము పాల్గొన్నారు.

కోసిగి: మండలంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్‌ ప్రశాంతంగా ముగిసింది.స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు ,మోడల్‌ స్కూల్‌, ప్రభుత్వ పాఠశాలల ముందు విద్యార్థి సంఘం నాయకులు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి స్థానిక వైఎస్సార్‌ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సంఘం జిల్లా కన్వీనర్‌ మారుతి మాట్లాడుతూ కార్పొరేట్‌ పాఠశాలలో ఫీజులు దోపిడీ అరికట్టాలని కోరారు.



బంద్‌లో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

తల్లీబిడ్డకు బలం

- వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ కింద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం
- అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్నం పోషకాహారం వడ్డింపు
- ప్రతినెలా రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, ఖర్జూరాలు, బెల్లం, చిక్కీలు అందజేత
- 15వ తేదీ నుంచి ఇంటికే సరుకులు పంపిణీ



వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ కిట్లతో మహిళలు

ఆదోని సెంట్రల్‌: ఆరోగ్యకరమైన సమాజం నిర్మించడంలో భాగంగా నిరుపేదల తల్లులు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తుంది. వైఎస్సార్‌ సంపూర్తణ పోషణ కింద రోజూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం బలవర్ధకమైన ఆహారం వండి వడ్డించడమే కాకుండా ప్రతి నెలా రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, ఖర్జూరాలు, బెల్లం, చిక్కీలు అందజేస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి మొత్తం పౌష్టికాహారానికి అవసరైన సరుకులన్నీ ఇంటికే అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆరేళ్ల లోపు చిన్నారులకు..

ఆదోని నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో 98 అంగనవాడీ కేంద్రాలు, పట్టణంలో 126 కేంద్రాలు ఉన్నాయి. పట్టణంలో 0–6 సంవత్సరముల పిల్లలు 1,184 మంది ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 11,937 మంది ఉన్నారు. పిల్లలకు ఉదయం వంద గ్రాముల పాలు, ఉడకబెట్టిన కోడి గుడ్డు ఒకటి ఇస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆకుకూరలతో కూడిన పప్పు లేదా టమాటా రసం, కాయగూరలతో కూడిన పప్పు వంటివి ఇస్తారు. ప్రతి శనివారం పులిహోరా, కిచిడి వంటి వంటకాలను వడ్డిస్తారు.

గర్భిణులు, బాలింతలకు..

ఆదోని పట్టణంలో 1,691 మంది గర్భిణులు, 1,462 మంది బాలింతలు ఉన్నారు. రూరల్‌ మండలంలో 1,505 మంది గర్భిణులు,1,261 మంది బాలింతలు ఉన్నారు. పిల్లలు 0–3 సంవత్సరములు ఎదిగే వరకు బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది. ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఒక ఉడకబెట్టిన గుడ్డు, 250 గ్రాముల పాలు అందిస్తుంది. అంగనవాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేవారికి మధ్యాహ్నం బలవర్ధకమైన ఆహారం ఇస్తుంది. వారి సంపూర్ణ పోషణ నిమిత్తం కేజీ జొన్నపిండి, రాగి పిండి, అటుకులు, 500 గ్రాములు బెల్లం, 250 గ్రాములు చిక్కీలను ఇంటికే ఇస్తున్నారు.

ఆరోగ్య పర్యవేక్షణ..

ప్రతి అంగనవాడీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందజేస్తుంది. పోషకాహారం ఆహారం, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరిస్తారు. ఫ్యామిలీ కాన్సెప్ట్‌ డాక్టర్‌ ద్వారా ఆరోగ్య సలహాలు, ఇమ్యునైజేషన్‌, హెల్త్‌ చెకప్‌ ద్వారా వైద్యసేవలు అందిస్తారు. కేంద్రంలో పిల్లలకు ప్రీ స్కూల్‌ బోధన సాగిస్తున్నారు. ప్రతి నెల పిల్లల పెరుగుదల, బరువును పరీక్షిస్తారు. ఎదుగుదల లేని వారిని తల్లులకు డాక్టరు ద్వారా సూచనలిస్తారు.

15వ తేదీ నుంచి ఇంటికే సరుకులు..

అంగనవాడీ కేంద్రాల్లో భోజనాలు చేయని వారి కోసం ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించాలని నిర్ణయించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటికే సరుకులను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది. గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి ప్రతి నెల 3 కేజీల బియ్యం, ఒక కేజీ బ్యాళ్లు, 500 గ్రాముల అయిల్‌, 5 ప్యాకెట్ల పాలు, 25 కోడి గుడ్లు, ఒక కేజీ చొప్పున రాగి పిండి, జొన్నపిండి, అటుకులు ఇస్తారు. వీటితో పాటు 250 గ్రాముల ఖర్జురాలు, 500 గ్రాముల బెల్లం, 250 గ్రాములు చిక్కీలను అందజేయనున్నారు.



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న ఆయా

ప్రతి నెల సరుకులు ఇస్తున్నారు



పోషకాహారంలో భాగంగా నాకు ప్రతి నెల రాగిపిండి, జొన్నపిండి, అటుకులు, ఖర్జూరాలు, బెల్లం, చిక్కీలు అందజేస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి రోజూ పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డును ఆహారంలో భాగంగా వడ్డిస్తున్నారు. నేను కూడా పిల్లలతో పాటు ఇక్కడికే వచ్చి భోజనం చేస్తున్నా. చాలా సంతోషంగా ఉంది. ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా సూచిస్తున్నారు. ఏవైనా సమస్యలుంటే ఫ్యామిలీ డాక్టర్‌ వచ్చినప్పుడు వైద్యం చేయిస్తున్నారు.

– పార్వతి, గర్భిణి, ఆదోని

పోషకాహారం అందించడం సంతోషం



ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారం అందిస్తుంది. ప్రతి రోజూ గుడ్డుతో పాటు పాలు, ఆహారం అందిస్తున్నారు. అలాగే ఇంటికే అటుకులు, బెల్లం, రాగిపిండి, ఖర్జూరాలు ఇస్తున్నారు. పిల్లలకు కూడా రోజూ ఉడకబెట్టిన గుడ్డు, పాలు ఇవ్వడం సంతోషకరం. మధ్యాహ్నం వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో కూడిన భోజనం వడ్డిస్తున్నారు. ఇంతకంటే బలవర్ధకమైన ఆహారం ఇంట్లో కూడా లభించదు కదా. తల్లులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం సంతోషంగా ఉంది.

– శ్రీదేవి, బాలింత, ఆదోని

15నుంచి ఇంటికే పౌష్టికాహార సరుకులు ఇస్తాం

గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ పథకం ద్వారా సరుకులను ఈ నెల 15 నుంచి ఇంటికే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ ద్వారా ఆరోగ్య పరీక్షలు కూడా ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా చేయాలని సూచించాం. పిల్లల ఎదుగుదల పోషణకు బలవర్ధకమైన ఆహారం అందజేస్తున్నాం.

– ఉమామహేశ్వరి, ఐసీడీఎస్‌ ఇన్‌చార్జ్‌ పీడీ

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామ సచివాలయం పరిధిలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌ సీపీ మండల ఇన్‌చార్జ్‌ పి. మురళీ మోహన్‌ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జంపాపురం సచివాలయం పరిధిలో నేడు, రేపు ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఆదోని టౌన్‌ : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్‌ కమిషనర్‌ రఘునాథ్‌ రెడ్డి బుధవారం పరిశీలించారు. కౌడల్‌పేట, సంతపేటలో జరుగుతున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలు, సైడ్‌వాల్స్‌ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. సంతపేటలో పూర్తయిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు వాటర్‌ క్యూరింగ్‌ సరిగా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. అనంతరం ఇందిరానగర్‌లోని చిన్నపిల్లల పార్కును సందర్శించారు.

పోషకాహారం పంపిణీ

ఆదోని అర్బన్‌ : టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త విట్టా రమేష్‌ బుధవారం పట్టణంలోని పది మంది పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందించారు. ఆరు నెలల పాటు పోషకాహార కిట్లను అందిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్తులు కావాలని కోరా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, ఎఫ్‌డీపీ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ బాలమురళీకృష్ణ, ఆదోని టీబీ యూనిట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ షేకున్‌ఖాను, జిల్లా పీపీఎం కో–ఆర్డినేటర్‌ డి.ఉమాపతి, జి.బాబురాజు పాల్గొన్నారు.

రైతును బాగుచేయాలన్నదే సీఎం లక్ష్యం



రాయితీపై మంజూరైన డ్రిప్‌ పైపులను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పీడీ ఉమాదేవి

మంత్రాలయం రూరల్‌: రైతును బాగుచేయాలన్నదే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాంపురం గ్రామంలో నియోజకవర్గానికి మంజూరైన రాయితీ బిందుసేద్యం పరికరాలను ఏపీఎం ఐపీ పీడీ ఉమాదేవి, మండల కన్వీనర్‌ భీమిరెడ్డి, ఇన్‌చార్జ్‌ విశ్వనాథ్‌రెడ్డితో కలసి రైతులకు అందజేశారు. పరికరాలకు సంబంధించిన స్టాల్‌ను పరిశీలించారు. రైతులకు మంజూరైన పరికరాలను తరలించే వాహనాలను జెండా ఊపి గ్రామాలకు పంపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో కరువు పరిస్థితులు అధికమని, ఈ పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం దృష్టికి తీసుకెళ్లగా మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లో 35 మంది రైతులకు రూ.34.21 లక్షల విలువ చేసే డ్రిప్‌ పరికరాలు మంజూరు చేశారని చెప్పారు. రైతులు స్థానిక సచివాలయాల్లో డ్రిప్‌ కావాలని దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తానని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మహ్మద్‌ ఖాద్రీ, ఏఓ జీర గణేష్‌, ఏపీడీ కృష్ణారెడ్డి, ఎంఐడీసీ జయరాంరెడ్డి, ఏఈఓ నరసింహులు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

రాయితీ విత్తనాల పంపిణీ

మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వందశాతం రాయితీపై కందులు, కొర్రల విత్తానలు అందిస్తుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం మండలానికి కందులు నాలుగు క్వింటాళ్లు, కొర్రలు 64 కేజీలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు అర్హులైన రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ అమర్‌నాథ్‌రెడ్డి

మంత్రాలయం రూరల్‌: భవిష్యత్‌ బాగుండాలంటే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రొఫెసర్‌ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని హెచ్‌ఆర్‌బీ కల్యాణ మండపంలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల శిక్షణ తరగతులు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ప్రొఫెసర్లు అమర్‌నాథ్‌రెడ్డి, రమేష్‌ చెడు వ్యవసనాలు, మూఢనమ్మకాలు శాస్త్రీయ దృక్పథం, నాగసుబ్బారెడ్డి స్వాతంత్య్ర ఉద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర, ఏఐఎస్‌ఎఫ్‌ చరిత్ర..భవిష్యత్‌ కార్యచరణ అంశాలపై రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి వివరించారు. ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు, అనంతపురం జిల్లా నుంచి కుళ్లాయి స్వామి, చిరంజీవి, సత్యసాయి జిల్లా నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌, నంద్యాల జిల్లా శ్రీనివాసులు, ధనుంజయ్‌ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు చెక్‌



ధ్రువ పత్రాలు అందజేస్తున్న దృశ్యం,



కాత్రికిలో ధ్రువ పత్రాలను అందజేస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్‌: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలన్నింకి పరిష్కారం లభిస్తుందని మండల కన్వీనర్‌ భీమిరెడ్డి, ఇన్‌చార్జ్‌ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సూగూరు, బూదూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్‌ చంద్రశేఖర్‌, ఎంపీడీఓ మణిమంజరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సూగూరులో 350 వివిధ రకాల ధ్రువ పత్రాలు, 350 కౌలు రైతుల కార్డులు, బూదూరులో 350 ధ్రువ పత్రాలను అందజేశారు. బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా రావడంలేదని, కాలనీలో నీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. ఆన్‌లైన్‌ అడంగల్‌ ఓపెన్‌ కాలేదని ఓ రైతు ఫిర్యాదు చేశారు. వీటిని తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పీఆర్‌ఏఈ నరసింహులు, సర్పంచ్‌ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రాలయంలో..

మంత్రాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరీ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో, సచివాలయం –1లో ఎంపీడీఓ బృందం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కౌతాళం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 11 రకాల ధ్రువ పత్రాలను ఇంటికే వచ్చి అందజేస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండంలోని రౌడూరు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు.

కౌతాళం: సమస్యలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ అమరేష్‌, జెడ్పీటీసీ రాధాప్రియదర్శిని తెలిపారు. మండలంలోని కాత్రికి గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి టీం, హాల్వి గ్రామంలో ఎంపీడీఓ సుబ్బారాజు టీం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి పలువురికి ధ్రువ పత్రాలు అందజేశారు. కోఆప్షన్‌ మెంబర్‌ మహబూబ్‌సాబ్‌, హాల్వి సర్పంచ్‌ క్రాంతి, కాత్రికి గ్రామ ఇన్‌చార్జ్‌ నాగభూషణ్‌గౌడ్‌, హాల్వి సచివాలయ కన్వీనరు బసప్పధని, చెన్నప్పధని, వైస్‌ ఎంపీపీ బుజ్జిస్వామి, కాగా 534మందికి టోకెన్స్‌ ఇవ్వగా 440 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పెద్దహరివాణంలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్‌: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. బుధవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను తన దృష్టికి తేవాలని సూచించగా.. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కాలువలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు లేవని స్థానికులు ప్రస్తావించగా.. రూ.40 లక్షలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం జగన్‌ విశేషంగా కృషి చేస్తున్నారని, పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రస్తుతం అందుతున్న పథకాలు, లబ్ధి ఇంతకుముందెన్నడైనా అందాయా అని ప్రజలను ప్రశ్నించారు. లేదని వారు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ డాక్టర్‌ మధుసూదన్‌, మార్కెట్‌యార్డు వైస్‌ చైర్మన్‌ కామాక్షి తిమ్మప్ప, ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ నాగమల్లయ్య, పీఆర్‌ ఏఈ మాలిక్‌బాషా, ఏపీఓ చంద్రశేఖర్‌, నాయకులు శ్రీలక్ష్మి, రేణుక,చంద్రశేఖర్‌రెడ్డి, మెడికల్‌ నాగరాజు, వీరేష్‌, గోవర్ధన్‌రెడ్డి, సంతోష్‌, గోపాల్‌రెడ్డి, మారెప్ప, లింగన్న, భాగ్యప్ప, సర్పంచ్‌ రాముడు, వైస్‌ సర్పంచ్‌ మల్లికార్జునరెడ్డి, వైస్‌ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీలు బసవరాజు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించండి

కౌతాళం: మండలంలో పనులు అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు ఆలస్యం కావడంతో గ్రామాల్లో ప్రజలు పనులు లేక పట్టణాలకు వలసలు పోయే అవకాశం ఉందని, వలసలను నివారించేందుకు ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఏపీఓ జుబేర్‌ అహ్మద్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌ రఫీక్‌, టెక్నికల్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

హాస్టల్‌ నిర్వహణ బాధ్యత యజమానిదే

ఆదోని టౌన్‌ : పట్టణంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహం నిర్వహణ బాధ్యత యజమానిదేనని వార్డెన్‌ విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరుకుందని, మైనర్‌ రిపేర్లు, అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వసతి గృహంలో 243 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, గడిచిన నాలుగేళ్లలో వసతి గృహానికి నెలకు రూ.1.10 లక్షలు అద్దె చెల్లించామని చెప్పారు. 2022 డిసెంబర్‌ వరకు అద్దె కానీ, కాస్మోటిక్‌ చార్జీలు కానీ ఏవీ పెండింగ్‌లో లేవని స్పష్టం చేశారు. 2023 జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలకు సంబంధించిన బిల్లులు త్వరలోనే మంజూరవుతున్నాయన్నారు. అద్దె భవనం కావడంతో ప్రభుత్వం మైనర్‌ రిపేరీలు, నిర్వహణను యాజమాన్యమే చేయించాల్సి ఉంటుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్‌ : హొళగుంద మండలం ఇంగళదహాల్‌ గ్రామానికి చెందిన హరిజన మునిస్వామి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేశామని ఇస్వీ హెడ్‌కానిస్టేబుల్‌ నాగేంద్ర బుధవారం రాత్రి తెలిపారు. మునిస్వామి కర్ణాటక నుంచి ఏపీ02ఏహెచ్‌1370 నంబర్‌ గల మోటార్‌ సైకిల్‌పై 90 ఎం.ఎల్‌. పరిమాణం గల 96 ఓసీ టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా ఆదోని సమీపంలోని ఎన్‌డీబీఎల్‌ ఫ్యాక్టరీ వద్ద మద్యం స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

వర్షం.. హర్షం



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

కౌతాళం: ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమై 20రోజులు గడిచినా సరైన వర్షం సరిగా లేక రైతన్నలు నిరాశ చెందుతున్న తరుణంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో రైతులు సంతోషంతో పొలాలవైపు పరుగులు తీశారు. 18.6ఎం.ఎం వర్షపాతం నమోదైందని అధికార వర్గాలు తెలిపారు. కౌతాళంతో పాటు బంటకుంట, సుళేకేరి, బాపురం, వీరాలదిన్నె, డంబలదిన్నె, అగసలదిన్నె, కాత్రికి గ్రామాల్లో రైతులు విత్తనాలు వేశారు. అధికంగా పత్తి పంట సాగుచేశారు. తుంగభద్ర నదీతీర గ్రామాల్లో ఉల్లినాట్లు వేశారు.



కాడెద్దులతో విత్తన సాళ్లు చేస్తున్న దృశ్యం